
బాగ్‌లింగంపల్లి మూన్‌కేఫ్ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రవిచారి

మూన్‌కేఫ్ చౌరస్తాలో

వర్షపు నీటి సమస్యను పరిష్కరించండి

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ రోడ్డు సరిగా వేయకపోవడంతో బాగ్‌లింగంపల్లిలోని మూన్‌కేఫ్ చౌరస్తాలో వర్షం నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని కార్పొరేటర్ కె. రవిచారి అన్నారు. వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మూన్‌కేఫ్ చౌరస్తాలో నిలిచిన వర్షపు నీటిని సోమవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : జేసీఎల్


జేసీఎల్ సునీతకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని జంటనగరాల కార్మిక సంయుక్త కమిషనర్(జేసీఎల్) జి. సునీత తెలిపారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆమెను ఏఐటీయూసీ హైదరాబాద్ నగర అధ్యక్షుడు ఎం. నరసింహ, ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, వర్కింగ్ అధ్యక్షుడు పి. వెంకటయ్య తదితరులు కలిసి అభినందించారు. ఏఐటీయూసీ నాయకులు హైదరాబాద్‌లో కార్మికుల స్థితిగతులను జేసీఎల్‌కు వివరించారు.

రంగారెడ్డిజోన్ జేసీఎల్‌గా శ్యామ్‌సుందర్‌రెడ్డి



చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జోన్ కార్మిక సంయుక్త కమిషనర్(జేసీఎల్)గా శ్యామ్ సుందర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. రంగారెడ్డి జోన్ జేసీఎల్‌గా ఇంతకు ముందు పనిచేసిన చతుర్వేది పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రంగారెడ్డిజోన్ పరిధిలోకి వచ్చే రంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ తదితర జిల్లాలోని కార్మికుల వివాదాల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ ప్రేమానంద్‌పాయ్ తెలిపారు. అంజయ్య భవన్ ఫీడర్ పరిధిలో జవహర్‌నగర్, లేబర్ కమిషనర్ ఆఫీస్, ఎస్ఆర్‌టీ క్వార్టర్స్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, వివేక్‌నగర్ పరిధిలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సత్యనారాయణస్వామి టెంపుల్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, సిటీసెంట్రల్ లైబ్రరీ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.


మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. విద్యా రంగానికి నిధులు పెంచాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. సోమవారం బీసీ విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో విద్యార్థుల సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వ రంగ విద్యా సంస్థల్లో కొత్త కోర్సులు ప్రవేశ పెట్టాలన్నారు. సమావేశంలో వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభ, మాజీ ప్రిన్సిపాల్ సుకన్య, బీసీ నాయకులు నీల వెంకటేష్, సతీష్, రాందేవ్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.


రంగనాథన్‌కు నివాళులర్పిస్తున్న నగర గ్రంథాలయ ఉద్యోగులు

గ్రంథాలయోద్యమ పితామహుడు రంగనాథన్

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డా. ఎస్.ఆర్. రంగనాథన్ గ్రంథాలయ ఉద్యమ పితామహుడని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరు పద్మజ అన్నారు. రంగనాథన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం చిక్కడపల్లిలోని నగర గ్రంథాలయ సంస్థలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు నిరుద్యోగులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ గ్రేడ్ -1 గ్రంథపాలకురాలు సుబ్బలక్ష్మి, హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ కార్యాలయ సిబ్బంది, పోటీపరీక్షల అభ్యర్థులు, పాఠకులు పాల్గొన్నారు.

గ్రంథాలయ పరిషత్ అభివృద్ధికి

దేవేందర్ సేవలు అభినందనీయం



దేవేందర్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ పరిషత్ అభివృద్ధికి, పాఠకులకు మెరుగైన సేవలు అందించడంలో మాజీ గ్రంథపాలకుడు, తెలంగాణ ప్రజా గ్రంథాలయాల అభివృద్ధి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొక్కుల దేవేందర్ అందించిన సేవలు అభినందనీయమని గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ పేర్కొన్నారు. గ్రంథపాలకుల దినోత్సవంలో భాగంగా సోమవారం అఫ్జల్‌గంజ్‌లోని రాష్ట్ర గ్రంథాలయ సంస్థలో జరిగిన కార్యక్రమంలో దేవేందర్‌కు సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. గ్రంథ పాలకుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గ్రంథాలయ సంస్థ తనను సన్మానించడం జీవితంలో మరిచిపోలేనని అన్నారు.

'పటేల్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి'

అంబర్‌పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పటేల్‌నగర్‌లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం పటేల్‌నగర్‌లో ఆయన పాదయాత్ర చేసి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణకు అవగాహన సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. హైమావతి

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హెచ్‌ఐవీ నివారణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. హైమావతి తెలిపారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్, స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ ప్రాజెక్ట్‌ల సంయుక్తాధ్వర్యంలో సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో హెచ్‌ఐవీపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. హెచ్‌ఐవీ సంక్రమణ మార్గాలపై ప్రచారం చేస్తున్నామని తెలిపారు. హెచ్‌ఐవీ సోకిన వారిపట్ల వివక్ష చూపొద్దన్నారు. అవగాహన కార్యక్రమాలు ఈనెల 12 నుంచి అక్టోబర్ నెలాఖరు వరకు జరుగుతాయన్నారు. హెచ్‌ఐవీ నివారణకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ చేస్తున్న కార్యక్రమాలకు అందరూ సహకరించాలని కోరారు. రాష్ట్రంలో రెడ్ రిబ్బన్ పాఠశాలలు, కళాశాలలు, కమ్యూనిటీలు హెచ్‌ఐవీ నివారణ కోసం పెయింటింగ్స్, వక్తృత్వ పోటీలు, ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎయిడ్స్ కంట్రోల్ అధికారులు వి. రవికుమార్, డాక్టర్ పి. ప్రసాద్, జాయింట్ డైరెక్టర్లు చంద్రారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ర్యాలీ

హెచ్‌ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు యువత, విద్యార్థులు కృషి చేయాలని రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్ సూచించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సోమవారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ విద్యాసంస్థలు, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సంయుక్తాధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ బాగ్‌లింగంపల్లి పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవీపై నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విద్యాసంస్థల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీధర్, ఎన్. కుమారస్వామి, ఎన్. స్వప్న తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళల పాత్ర మరువలేనిది

● కావ్యా కిషన్‌రెడ్డి


తిరంగా ర్యాలీలో కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి, డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు తదితరులు

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళల పాత్ర మరువలేనిదని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్. గౌతమ్ రావు అన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి, సరోజినీనాయుడు, దుర్గాబాయిదేశ్‌ముఖ్ లాంటి ఎంతోమంది వీర వనితలు ఆంగ్లేయులను ఎదిరించి దేశం కోసం ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం బర్కత్‌పురలో బీజేపీ నగర కార్యాలయం నుంచి మహిళా మోర్చా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. మహిళలు త్రివర్ణ పతాకాలను చేపతపట్టి ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని నేటి యువత దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా మోర్చా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై. అమృత, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, అధికార ప్రతినిధి ఎడెల్లి అజయ్‌కుమార్, నియోజకవర్గం కన్వీనర్ శ్యాంరాజ్, మహిళా మోర్చా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాల పంపిణీ

అంబర్‌పేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యారెడ్డి అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో జాతీయ భావం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్ రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి. ఆనంద్‌గౌడ్, అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు దాసోజు నాగభూషణం చారి, నాయకులు వెంకటస్వామి గౌడ్, భిక్షపతి, ఆర్. కృష్ణముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్, డీవైఎఫ్ఐ నాయకులు

గంజాయి, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్‌కు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని, వాటికి బానిసలుగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో 'గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం.. సమాజాన్ని కాపాడుకుందాం' అనే వాల్ పోస్టర్‌ను మేయర్ సోమవారం ఆవిష్కరించారు. అనంతరం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువజన సంఘాలు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, డ్రగ్స్ లేని సమాజం కోసం అందరూ కలిసి రావాలని కోరారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారం జరుగుతున్నా, డ్రగ్స్ వినియోగం తగ్గడం లేదని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.డీ జావీద్ కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్, హైదరాబాద్ సెంట్రల్ సిటీ జిల్లా అధ్యక్షుడు దామెర హష్మీబాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి


జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న పీవైఎల్ కార్యకర్తలు

కవాడిగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, వీధి కుక్కల బెడదను అరికట్టాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) డిమాండ్ చేసింది. గ్రేటర్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం చలో జీహెచ్‌ఎంసీ కార్యాలయ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. పీవైఎల్ కార్యకర్తలు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. గేటు ఎక్కి నిరసన తెలిపారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనంతరం కమిషనర్ ఆమ్రపాలి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్ మాట్లాడుతూ.. గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్‌ల బారిన పడుతున్నారని ఆరోపించారు. డెంగీ బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందన్నారు. దోమల నివారణలో జీహెచ్‌ఎంసీ విఫలమైందన్నారు. పీవైఎల్ ఆధ్వర్యంలో 20 బస్తీల్లో సర్వే చేయగా.. దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదని ప్రజలు తెలిపారని అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో పీవైఎల్ గ్రేటర్ అధ్యక్షుడు ఎం. రవికుమార్, కార్యదర్శి బీఎస్ కృష్ణ, నాయకులు కిరణ్, బంగారి శ్రీనివాస్, కొల్లూరి బీమేష్, మల్లేష్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యంగా ఉన్నప్పుడే న్యాయం


వకుళాభరణం కృష్ణమోహన్‌ను సన్మానిస్తున్న బిజ్జి కనకేష్ కుమార్, నర్సింగ్‌రావు తదితరులు

ముషీరాబాద్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఐక్యంగా ఉన్నప్పుడే న్యాయం జరుగుతుందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. సోమవారం బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీ సమ్మేళన సభ ముగింపు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కృష్ణమోహన్‌ను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో-ఆర్డినేటర్, బీసీ కుల సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర సీనియర్ నాయకుడు బిజ్జి కనకేష్‌కుమార్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వకుళాభరణం మాట్లాడుతూ.. బీసీలు ఐక్యంగా ఉన్నప్పుడు రిజర్వేషన్లలో న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక నాయకులు నర్సింగ్‌రావు, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

కొందరు మాత్రమే కళాకారులు కాగలరు

గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి



చంద్రశేఖర్, సంతోష్‌ను సత్కరించిన రాజకుమారి

చిక్కడపల్లి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కొందరు మాత్రమే కళాకారులు కాగలరని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి అన్నారు. మిమిక్రీ ఆర్టిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ వారు త్యాగరాయగానసభ సౌజన్యంతో సోమవారంరాత్రి గానసభలో మిమిక్రీ కళాకారుల సాంస్కృతిక సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాజకుమారి అసోసియేషన్‌కు ఆరేళ్లుగా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహించిన చంద్రముఖి చంద్రశేఖర్, విదేశాల్లో వందల మిమిక్రీ, వెంట్రిలాక్విజమ్ ప్రదర్శనలు ఇచ్చిన సంతోష్‌ను సత్కరించి మాట్లాడారు. కళాకారులు తాము ఆనందిస్తూ ఇతరులను ఆనందపరుస్తారన్నారు. సినీనటుడు శివారెడ్డి మాట్లాడుతూ.. కళాకారులు నిరంతర అభ్యాసంతో కళను మెరుగుపర్చుకోవాలన్నారు. అధ్యక్షత వహించిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు జీవీఎన్ రాజు మాట్లాడుతూ.. మిమిక్రీ కళాకారుల సంక్షేమం కోసం సంఘం ఏర్పాటు చేసుకోవడం మంచి ఆలోచన అన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ.. ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ జయంతి సందర్భంగా మూడు రోజులపాటు మిమిక్రీ పండుగ చేసేందుకు గానసభను ఉచితంగా ఇస్తామని, వారంలో ఒకరోజు గానసభలో ఆసక్తిగల వారికి మిమిక్రీలో శిక్షణ ఇచ్చే అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. బాలసాహిత్య రచయిత చొక్కాపు వెంకటరమణ, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్, కళాకారులు బుల్లెట్ భాస్కర్, శాంతకుమార్, పేరడీ గురుస్వామి, షరీఫ్ తదితరుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

రాడార్ ప్రాజెక్టుకు

రిజర్వ్ ఫారెస్ట్ భూమిని కేటాయించొద్దు

పంజాగుట్ట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూములను భారత నౌకాదళానికి వెరీ లో ఫ్రీక్వెన్సీ(వీఎల్ఎఫ్) రాడార్ స్టేషన్ కోసం కేటాయించొద్దని వివిధ సంస్థల నాయకులు డిమాండ్ చేశారు. అటవీ భూములను వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ కోసం కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు.

సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.కార్తీక్ యాదవ్, సమన్వయకర్త రాజుయాదవ్, భారత్ కిసాన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డీకే చంద్రశేఖర్‌యాదవ్, గీత, సామాజిక కార్యకర్త రుచిత్ ఆశా కమల్, శ్రీశైలంయాదవ్, ఆదిత్య, లోకేష్ తదితరులు మాట్లాడారు. ఈ ప్రాజెక్టు వల్ల వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం అడవుల్లో 2,900 ఎకరాల అటవీ భూమిలోని 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందన్నారు. 20 గ్రామాల్లోని సుమారు 60వేల మంది ప్రజల జీవితాలపై, అడవిపై ఆధారపడిన చిన్న రైతులు, పశువుల మేత, జీవుల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వాతావరణ సంక్షోభాల రీత్యా దామగుండం అడవుల్లో రాడార్ ప్రాజెక్టును కొనసాగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

'నకిలీ రేడియోగ్రాఫర్స్‌పై చర్యలు తీసుకోవాలి'

రాంనగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇన్ మెడికల్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (డీఎంఐటీ) కోర్సు పూర్తి చేయకుండా రాష్ట్రంలో కార్పొరేట్, వివిధ ఆస్పత్రులలో పనిచేస్తున్న అర్హత లేని రేడియోగ్రాఫర్స్‌ను గుర్తించి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంత్రి దామోదర రాజనర్సింహను రాష్ట్ర రేడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధి సురేష్ కోరారు. సోమవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో జరిగిన రేడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హతగల రేడియో గ్రాఫర్స్‌కు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

నకిలీ రేడియోగ్రాఫర్స్‌పై చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో రేడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు పి. విష్ణు, ఇందుశేఖర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్

డ్రగ్స్‌ను దేశం నుంచి తరిమికొట్టాలి

● విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాకుండా సమాజాన్ని నాశనం చేస్తాయని, ప్రతి ఒక్కరూ దేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడానికి కృషిచేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ అన్నారు. గోల్కొండ ప్రభుత్వ బాలుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులతో డ్రగ్స్ ఫ్రీ ఇండియా, డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం జరగకుండా చూడాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలన్నారు. కొవిడ్ మహమ్మారిని తరిమికొట్టినట్లే మాదకద్రవ్యాలను దేశం నుంచి పారదోలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఈఓ ఆర్.రోహిణి, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్, డిప్యూటీ డీఈఓ రమణరాజు, డిప్యూటీ ఐఓఎస్ మామూల్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ మైత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేణుస్వామిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో సినీ ప్రముఖులపై వ్యాఖ్యలు చేస్తున్న వేణుస్వామి ఇటీవల జరిగిన అక్కినేని నాగచైతన్య, శోభిత దూళిపాళ నిశ్చితార్థం రోజున వారి జాతకాలపై చేసిన వీడియో పెనుదుమారం రేపింది. వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ సోమవారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వై.జె.రాంబాబు, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షురాలు వనం ప్రేమమాలిని, కార్యదర్శి వేదుల మూర్తి పాల్గొన్నారు.


ఫీవర్ ఆస్పత్రి ఓపీ వద్ద రోగుల రద్దీ

ఫీవర్ ఆస్పత్రికి రోగుల తాకిడి

● ఓపీకి 654 మంది

● వైరల్ ఫీవర్, డయేరియా బారిన పడిన 15 మంది

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రికి రోగుల తాకిడి పెరిగింది. వాతావారణంలో వచ్చిన మార్పులతోపాటు కలుషిత ఆహారం, నీరు తాగడంతో డయేరియా బారిన పడుతున్నారు. ఇటీవల కాలంలో డయేరియా కేసులు బాగా పెరిగాయి. వైరల్ ఫీవర్ కేసులు కూడా నమోదవుతున్నాయి. సోమవారం ఫీవర్ ఆస్పత్రి ఓపీకి 654 మంది వచ్చారు. వైరల్ ఫీవర్ బారిన పడిన 10 మంది, డయేరియాతో ఐదుగురు ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. బయటి వాటర్, ఫుడ్ తీసుకోవద్దని, కాచి వడపోసిన నీరు తాగాలని, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు.

'జనాభా దామాషా ప్రకారం వర్గీకరణ అమలు చేయాలి'

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ జనాభా దామాషా ప్రకారం వర్గీకరణను అమలు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య డిమాండ్ చేశారు. సోమవారం సాయంత్రం కాచిగూడలో ఓ హోటల్‌లో కుల సంఘాల ప్రతినిధులు, మేధావులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేస్తేనే ఎస్సీ కులాలకు సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ రంగాలలో న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. మంత్రి దామోదర రాజనర్సింహ, మాదిగ ఎమ్మెల్యేలు వీటిని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాదిగలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. సమావేశంలో పలు సంఘాల నాయకులు సిలారపు రామచందర్. ప్రొఫెసర్ ముత్తయ్య, ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం. ప్రొఫెసర్ మల్లేష్. విజయ్‌కుమార్. బీఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి'

గోల్నాక, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జైస్వాల్ గార్డెన్ కాలనీలో పార్కు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. పార్కుకు కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించి కాంపౌండ్ వాల్ నిర్మించారని డీఎంసీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్ ముదిరాజ్, శ్రీమైసమ్మ దేవాలయం కమిటీ అధ్యక్షుడు నూనెముంతల రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైలులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లిలో నివసిస్తున్న స్రవంతి కుటుంబ సభ్యులతో కలిసి ఔరంగాబాద్ వెళ్లింది. తిరుగు ప్రయాణంలో అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. నిజామాబాద్ వద్ద ఆమె బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అందులో ఒకటిన్నర తులాల బంగారు నల్లపూసల గొలుసు, రెండు సెల్ ఫోన్లు, 20 పౌండ్స్ విదేశీ కరెన్సీ ఉంది. బాధితురాలు సోమవారం కాచిగూడ చేరుకున్న తర్వాత రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్టీఆర్ స్టేడియం బస్టాప్ వద్ద సుమారు 55 నుంచి 60 ఏళ్ల వయస్సుగల వ్యక్తి చనిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు భిక్షాటన చేసుకునే వాడని స్థానికులు తెలిపారు.